క్లుప్తంగా

దివ్యాంగులకు భోజన వసతి

అమలాపురం రూరల్: అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యురాలు కూచిమంచి నాగమణి సహకారంతో ఆదివారం ఈదరపల్లి హరిమనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగ విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి, గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు గోటేటి గంగాధరరావు, గోటేటి లక్ష్మి, శ్రీగిరి పద్మావతి, కార్యదర్శి వై.అనంతలక్ష్మి, కోశాధికారి కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర


ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మ తల్లి

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి ఓఎన్జీసీ సెంటర్‌లో వేంచేసి ఉన్న సత్తెమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి నైవేద్యాలు చెల్లించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం


స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అమలాపురం రూరల్: వీరవెల్లిపాలెం ముద్రగడ నాగయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్న తమ తోటి మిత్రులకు సాయం చేశారు. అయినవిల్లి మండలం అద్దంకివారిలంక గ్రామానికి చెందిన దాకే శ్రీను, జుత్తుక సత్యనారాయణ కుటుంబాలకు తమ వంతుగా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అమలాపురంలో ఆదివారం అందించారు. కార్యక్రమంలో వంకా శ్రీను, దొడ్డా వెంకటేశ్వరరావు, పిల్లి సూర్యప్రకాశరావు, తిరుకోటి శ్రీను, పాము ఏడుకొండలు, పల్నాటి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి మృతికి సంతాపం


రామ్మూర్తి(ఫైల్)

అల్లవరం: మద్యపాన నిషేధ పోరాటం, మాల మహనాడు ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పచ్చిమాల రామ్మూర్తి(రాముడు) మరణంపై సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామ్మూర్తి దేవగుప్తంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతాపం తెలిపినవారిలో ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల రాంబాబు, మాకే కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్‌లు పోతుల నాగరాజు, బులా లోక్‌నాథ్, పోతుల అప్పారావు, పినిపే ప్రకాశరావు తదితరులున్నారు.

21న వర్ణ చిత్రాల ప్రదర్శన

యానాం: ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న మురమళ్ల శాంతినికేతన్ ప్రాథమిక, హైస్కూల్ పాఠశాలలో యానాంకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కాకర్లపూడి కేశవవర్మ గీసిన వర్ణ చిత్రాల ప్రదర్శన నిర్వహించనున్నారు. శాంతినికేతన్ స్కూల్స్, పీటీఎం పుల్లెల తాతయ్య మెమోరియల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

చొల్లంగి భూములను స్థానికులకే ఇవ్వాలి


చొల్లంగిలో నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి గ్రామంలోని 47-3 సర్వే నెంబరులోని భూములను స్థానిక లబ్ధిదారులకే కేటాయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తమ గ్రామంలో ఉన్న స్థలాలను వేరే ప్రాంతంవారికి కేటాయించడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు చేస్తున్న నిరసన దీక్షలు 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ చొల్లంగి గ్రామ పంచాయతీలో అనేక మంది లబ్ధిదారులు ఉన్నారని వారికి పటవల, జి.వేమవరంలో స్థలాలు ఇచ్చి చొల్లంగిలో స్థానికంగా ఉన్న భూములను మాత్రం కాకినాడ రూరల్ మండలం ఉప్పలంక వాసులకు కేటాయించడం దారుణమన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చొల్లంగిలో భూములను స్థానిక లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్


జిల్లా స్వర్ణకార సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: స్వర్ణకారులు, విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తాను చొరవ చూపుతున్నానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వారి సంక్షేమానికి, అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఆయన గుర్తు చేశారు. జిల్లా స్వర్ణకార సంఘానికి ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు స్థానిక స్వర్ణకార సంఘ భవనంలో ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సభకు మంత్రి విశ్వరూప్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా సంఘానికి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అమలాపురానికి చెందిన తాతాబత్తుల అప్పలాచార్యులుతో పాటు నూతన జిల్లా కమిటీ కూడా ప్రమాణం స్వీకారం చేసింది. రాష్ట్రంలో 20 లక్షల జనాభాగా ఉన్న విశ్వ బ్రాహ్మణులకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని సంఘీయులు మంత్రి విశ్వరూప్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే అమలాపురం స్వర్ణకార సంఘ భవనం పైఅంతస్తు నిర్మాణానికి నిధులు కేటాంచాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి విశ్వరూప్ సంఘ భవనం పైఅంతస్తు నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

పట్టణంలో భారీ ర్యాలీ

ప్రమాణ స్వీకార సభకు ముందు స్వర్ణకార, విశ్వ బ్రాహ్మణ సంఘాలకు చెందిన ప్రతినిధులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి మొదలై మెయిన్ రోడ్డు, గడియారం స్తంభం సెంటరు మీదుగా స్వర్ణకార సంఘ భవనం వద్దకు ర్యాలీ చేరుకుంది. ర్యాలీలో దామాషా ప్రకారం విశ్వ బ్రాహ్మణుల జనాభాకు అనుగుణంగా ఎమ్మెల్యే సీటు కేటాయించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ దార్ల పాపయ్యచార్యులు, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ర్యాలీ రాజశేఖర్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దార్ల శ్రీనివాసరావు, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొచ్చర్ల కొటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, అమలాపురం స్వర్ణకార సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఆవుపాటి వేణుగోపాల్, జిల్లా స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణి ప్రకాష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మెట్ల రమణబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ అనురాధ

అల్లవరం: బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీ అనురాధ ఆదివారం పరిశీలించారు. సీఎస్ఆర్ నిధులు రూ.25 కోట్లతో పేరూరు నుంచి గోడిలంక, బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ రెండు పనులుగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పేరూరు నుంచి గోడిలంక రోడ్డు విస్తరణ పనులు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. బెండమూర్లంక నుంచి ఓడలరేవు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్‌తో ఆమె చర్చించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

నైతిక విలువలే మనో వికాసానికి తొలి మెట్టు


బాలబాలికలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ ప్రభాకరరావు

అల్లవరం: నైతిక విలువలే బాల బాలికల మనో వికాసానికి తొలి మెట్టు అని ప్రముఖ వైద్యులు ఈఎన్‌టీ స్పెషలిస్ట్ ప్రభాకరరావు అన్నారు. శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొగళ్లమూరు రామాలయంలో బాల వికాస కేంద్రాన్ని ప్రభాకరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం బాల బాలికల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బాల వికాస కేంద్రానికి విచ్చేసిన 25 మంది బాలురు, 35 మంది బాలికలకు డాక్టర్ ప్రభాకర్‌రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయుడు విష్ణు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 25 మంది చేరిక


వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామ పంచాయతీకి చెందిన 25 మంది ఆదివారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామ ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు దెయ్యాల సత్తిబాబు, నీలపాల శ్రీనివాసరావు, మట్టా లింగమూర్తిల ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 25 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం


జగతా పద్మనాభం బొంతు సత్యశ్రీనివాస్ నల్లా నరసింహమూర్తి కాదా గోవిందకుమార్ పిన్నమరాజు వెంకటపతిరాజు

ముమ్మిడివరం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా వైఎస్సార్ సీపీ అడుగులు వేసింది. ఈ మేరకు మండల కమిటీలను నియమిస్తూ పలువురు కీలక నేతలకు చోటు కల్పించింది. వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయతీరాల వైపు తీసుకెళ్లే గురుతర బాధ్యతను వారికి అప్పగించింది. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధిష్ఠానం మండల కమిటీలను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

- ముమ్మిడివరం మండలంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా జగతా పద్మనాభం(బాబ్జీ), ఉపాధ్యక్షులుగా కుడిపూడి శ్రీనివాసరావు, మోర్త శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శులుగా ఎద్ల సత్యవరప్రసాద్, గొలకోటి ఆంజనేయులు, రెడ్డి వెంకటరమణ, కార్యదర్శులుగా నక్కా రామారావు, సవరపు కన్నబాబు, గుత్తుల సత్యనారాయణమూర్తి, పోతూరి వెంకట పతిరాజు, గుత్తుల శ్రీనివాస్, ట్రెజరర్లుగా ఎస్.నోమరాజు, మరో 15 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారు.
- ముమ్మిడివరం నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా బొంతు సత్యశ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రాజులపూడి కృష్ణ, పోతుల రాజేష్, ప్రధాన కార్యదర్శులుగా చెల్లి మధు, బుడితి శ్రీను, కుడిపూడి హరికృష్ణ, కార్యదర్శులుగా ఎలిపే దుర్గ, యనమదల శ్రీను, కర్రి కృష్ణమూర్తి, కడలి సత్యం, బూడే బాలయోగేంద్ర వరప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్‌గా కటికిదల చంటి బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఐదుగురు సభ్యులు నియమితులయ్యారు.
- కాట్రేనికోన మండల పార్టీ అధ్యక్షుడిగా నల్లా నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా గాలిదేవర ధనబాబు, జొన్నాడ వీరాస్వామి, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మిడి శ్రీనివాసరావు, అక్కల శివరామకృష్ణ, గుత్తుల సత్యనారాయణ, కార్యదర్శులుగా సంగాని సతీష్, కాంద్రేగుల సూర్యనారాయణ, ఎలిపే సూర్యప్రకాష్, ఎసుగంటి సుబ్బారావు, గుత్తుల రవీంద్రనాథ్, పెయ్యల సురేష్‌బాబు, ట్రెజరర్ వజ్రపు సత్యనారాయణ, మరో 14 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నియమితులయ్యారు.
- తాళ్లరేవు మండల పార్టీ అధ్యక్షుడిగా కాదా గోవిందకుమార్, ఉపాధ్యక్షులుగా మాసా శ్రీనివాస్, కొప్పనాతి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా మెకా మధుబాబు, అర్థాడి అన్నవరం, బొంతు వీరమోహన్, యర్లనీడ అప్పారావు, కార్యదర్శులుగా మల్లాడి నూకరత్నం, బాతుల అరుణకుమార్, పూల రమేష్, గురజాపు లోవరాజు, వేగిన రమేష్‌రాజు, సంగాని శ్రీనివాసరావు, మురమళ్ల అనంతలక్ష్మి, నీలా శ్రీనివాసు, మరో ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారు
- ఐ.పోలవరం మండల పార్టీ అధ్యక్షుడిగా పిన్నమరాజు వెంకటపతిరాజు(శ్రీను), ఉపాధ్యక్షులుగా వడ్డి గౌతమ్, అంగాడి సీతారామ్, ప్రధాన కార్యదర్శులుగా రేవు సత్యనారాయణ, లంకా ఏడుకొండలు, శీలం వెంకట రమణ, కార్యదర్శులుగా సాధనాల బాబురావు, రెల్లి వెంకటేష్, పచ్చిమల విజయ్, రేకాడి శ్రీను, ముదునూరి ఫణిరాజు, ట్రెజరర్‌గా సుంకర నాగబాబు, మరో 15 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారు.

హోంగార్డు అభ్యర్థులకు పుదుచ్చేరిలో వసతి ఏర్పాట్లు

- ఎమ్మెల్యే అశోక్ చొరవతో యానాం యువతకు తప్పిన ఇబ్బందులు


పుదుచ్చేరి గెస్ట్‌హౌస్‌లో వసతి పొందిన యానాం అభ్యర్థులు

యానాం: హోంగార్డు ఎంపిక పరీక్షల నిమిత్తం పుదుచ్చేరి వెళ్లిన వందలాది మంది యానాం యువకులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చొరవతో వివిధ లాడ్జిల్లో వసతి సౌకర్యాన్ని ఏర్పాటుచేయడంపై పలువురు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యానాం నుంచి రాజధాని పుదుచ్చేరి వందలాది కిలోమీటర్ల దూరంలో ఉంది. హోంగార్డు ఎంపిక పరీక్షలకు పుదుచ్చేరి వెళ్లిన యానాం అభ్యర్థులు వసతి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అశోక్ తన సొంత ఖర్చులతో పుదుచ్చేరిలోని గోరిమేడు ప్రాంతంలో మూడు గెస్ట్ హౌస్‌లను తీసుకుని 350 మందికి అక్కడే వసతి కల్పించారు. అదేవిధంగా సోమవారం నుంచి మహిళా అభ్యర్థులు సైతం రానుండటంతో వారికి సైతం ప్రత్యేకంగా వసతి కల్పించడానికి చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. పుదుచ్చేరి పోలీస్ ఆర్మ్‌డ్ గ్రౌండ్‌లో గత కొద్ది రోజులుగా హోంగార్డు అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలోని శ్రీరామచంద్రమూర్తి స్వామి ఆలయంలో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు, భరత ముని జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆరాధనాత్సవాల్లో మహిళలు సామూహికంగా ఆలపించిన త్యాగరాజ కృతులు అలరించాయి. అనంతరం జిల్లా సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్‌లు ఆరాధోనత్సవాల్లో పాల్గొన్న సంగీత, నృత్య కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా ఉపాధ్యక్షులు కూచిమంచి కృష్ణ, పేరి వాణి, ఆంధ్ర ఉషారాణి, కొత్తూరి బాల, గొలకోటి కమల, తాతపూడి సౌమ్య లక్ష్మి, నిత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

తాళ్లరేవు: స్థానిక బైపాస్ రహదారిలో పునర్నిర్మించిన శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామివారికి ఉదయం 5.30 గంటల నుంచి పంచామృతాభిషేకం, మండపారాధన, శ్రీలక్ష్మీగణపతి హోమం, స్వామివారి గ్రామోత్సవం, సాయంత్రం స్వామివారి పడిపూజ, అనంతరం పుష్పాభిషేకం నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆయా పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉత్సాహంగా సూర్య నమస్కారాల పోటీలు


బాలయోగి స్టేడియంలో సూర్య నమస్కారాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యానాం: రథ సప్తమిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బాలయోగి క్రీడాప్రాంగణంలో కాకినాడ సేవాభారతి ఆధ్వర్యంలో సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 14 పాఠశాలల నుంచి 179 విద్యార్థులు పాల్గొని సూర్య నమస్కారాల విన్యాసాలను నిర్వహించి అందరినీ అబ్బుర పరిచారు. పోటీల్లో అంబేడ్కర్ ప్రభుత్వ పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె.లోకేష్‌కుమార్‌కు ప్రథమ స్థానం, యానాం పబ్లిక్ స్కూల్ 6వ తరగతి విద్యార్థి కె.హర్షవితిన్ ద్వితీయ స్థానం, శ్రీవిద్యాలయ కాపులపాలెం 10వ తరగతి విద్యార్థి ఐవీసీ హెచ్ఎల్ఎస్‌డీ బాలాజీ తృతీయ స్థానం సాధించారు. వారికి ప్రశంసా పత్రం, జ్ఞాపిక, నగదు బహుమతులతో పాటు మరో 12 మందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఆర్ఎస్ఎస్ రాజమహేంద్రవరం విభాగ్ ప్రచారప్రముఖ్ నముడూరి కృష్ణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో దవులూరి నాగేశ్వరరావు, చెరుకూరి రవి వర్మ, అద్దేపల్లి వెంకటకృష్ణ, కంచర్ల వీర్రాజు, ప్రసాద్, కామరాజు, మాజేటి భాస్కర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సౌరయాగంలో రాజశ్యామల హోమం


విలసవిల్లి సౌరయాగంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహాసౌరయాగంలో తొమ్మిదో రోజు రాజశ్యామల హోమం నిర్వహించారు. అర్చకులు మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఆదివారం రాజశ్యామల అమ్మవారికి లక్ష కుంకుమార్చన, పూర్ణాహుతి నిర్వహించారు. ఋత్విక్ బృందం రోహిణి నక్షత్ర జాతకులచే నేరేడు చెట్టుకు పూజలు చేయించారు. దీంట్లో భాగంగా శ్రీచక్రార్చన, సౌర అష్టాక్షరీ జపాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సర్పంచ్‌ను పరామర్శించిన మంత్రి విశ్వరూప్


సర్పంచ్ అరుణను పరామర్శిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: అనారోగ్యంతో చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పేరూరు సర్పంచ్ దాసరి అరుణను ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, ఎంపీటీసీ చొల్లంగి సుబ్బిరామ్ తదితరులున్నారు.

అభ్యర్థుల ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠ

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి పోటీచేసే అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీల కూటములు ఎటూ తేల్చకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని చెప్పినా జరగలేదు. ముఖ్యంగా అధికార బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీల కూటమి అభ్యర్థిగా హోంమంత్రి నమశ్శివాయంను భావించినా ఆయన జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. దీంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను పలువురు సూచిస్తున్నారు. నామినేటెడ్ ఎమ్మెల్యే రామలింగం, రాజశేఖర్, కారైకల్ పేర్లు సైతం బీజేపీ నుంచి చెబుతున్నారు. కాంగ్రెస్, డీఎంకే కూటమి నుంచి ప్రస్తుత ఎంపీ వైథిలింగంను అభ్యర్థిగా ప్రకటించినా ఆయన స్థానిక రాజకీయాల వైపే మొగ్గు చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం నారాయణస్వామి, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏవీ

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత


పట్టుకున్న నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

యానాం: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కట్టా సుబ్బరాజు ఆదివారం తెలిపారు. దరియాలతిప్పకు చెందిన పెయ్యల ప్రసాద్ అనే వ్యక్తి బైక్‌పై 100 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా ఫ్లడ్ బ్యాంక్ రహదారిలో తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి బైక్‌ను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని డీటీ ఎక్సైజ్ అధికారి వద్ద హాజరుపరచగా రూ.10 వేల జరిమానా వేశారన్నారు.

మార్కెట్ యార్డులో టేకు చెట్టు మాయం


మార్కెట్ యార్డులో టేకు చెట్టును నరికేసిన దృశ్యం

ముమ్మిడివరం: స్థానిక మార్కెట్ యార్డులో ఒక భారీ టేకు చెట్టును దొంగిలించుకుపోయారు. సుమారు 40 ఏళ్ల వయసున్న ఈ టేకు చెట్టు విలువ రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. టేకు చెట్టు మాయం వెనుక మార్కెట్ యార్డ్‌లో పనిచేసి బదిలీ అయిన ఓ ఉద్యోగి హస్తం ఉందన్న చర్చ స్థానిక ఉద్యోగ వర్గాల్లో సాగుతోంది. అయినా మార్కెట్ కమిటీ పాలకవర్గం కాని, అధికారులు కాని పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నియామకాల కేసు కొట్టివేత

యానాం: నిబంధనలకు విరుద్ధంగా నియమించిన 53 మంది మల్టీపర్పస్ సిబ్బందిని డిస్మిస్ చేస్తూ ఆదివారం చెన్నై హైకోర్టు తీర్పునిచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థ శాదిసరాయ ప్లాంట్‌లో 2015లో నిబంధనలకు విరుద్ధంగా నియామక పత్రాలు జారీ చేసి వారందరికీ రోజువారీ వేతనాలు ఇచ్చేవారు. తమను పర్మినెంట్ చేయాలని వారంతా చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు విచారించి ఈ నియామకాలు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసు ద్వారా జరగాలన్నారు. ఆ విధంగా పేర్లు రిజిష్టర్ చేసుకోవాలని, కనీస అర్హతలు ఉండాలన్నారు. అపాయింట్‌మెంట్ ఇచ్చేటప్పుడు విద్యార్హతలు, వయసు పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఉద్యోగాల నోటిఫికేషన్ వేయకుండా ఇచ్చే నియామకాలు చెల్లవని జడ్జిలు మహదేవన్, మహ్మద్ షబ్బీకీ తీర్పునిచ్చారు.

వైభవంగా వీరభద్రేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ


పెదపట్నంలంకలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: పెదపట్నంలంకలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత బాల వీరభద్రేశ్వరస్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మాఘ శుద్ధ నవమి ఉదయం 10.42 గంటలకు రోహిణీ నక్షత్రయుక్త మేష లగ్నంలో గంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవం కనులపండువగా జరిపించారు. శిరిగినీడి గోపీనాథ్, హేమజ్యోతి దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పుణ్యాహవాచనం అనంతరం స్వామి వార్ల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠలను భక్తుల కోలాహలం నడుమ ఘనంగా జరిపించారు. అనంతరం స్వామి వారి శాంతి కల్యాణంలో పలువురు దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. మహదాశీర్వచనం అనంతరం అఖండ అన్న సమారాధన జరిగింది. పాశర్లపూడి ఉత్తరబాడవలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు


రీజనల్ చైర్మన్ శ్రీరామరాజును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో రీజనల్ చైర్మన్ ముదునూరి శ్రీరామరాజు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో లయన్స్ క్లబ్ సభ్యులకు అవార్డులు అందజేశారు. రీజియన్-1లో ప్రథమ బెస్ట్ యాక్టివ్ జోన్ చైర్మన్‌గా జంపన సుమన్ వర్మకు అవార్డు అందించారు. రీజియన్‌లో అమలాపురం లయన్స్ క్లబ్‌కి ప్రథమ బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్‌తో పాటు సెకండ్ బెస్ట్ ప్రెసిడెంట్, సెకండ్ బెస్ట్ సెక్రటరీ, బెస్ట్ సర్వీస్, బెస్ట్ పర్మినెంట్ ప్రాజెక్టు తదితర విభాగాల్లోనూ అవార్డులు వచ్చాయి. అమలాపురం లయన్స్ క్లబ్ సభ్యులు రీజనల్ చైర్మన్ ముదునూరి శ్రీరామరాజును సత్కరించారు.